
సాక్షి
జగిత్యాల

బుధవారం ¡ 15 ¡ ఫిబ్రవరి ¡ 2023



పోటెత్తిన భక్తులు

కొండగట్టు : శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తులు పోటెత్తారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



అమరులకు నివాళి

జగిత్యాలటౌన్: పుల్వామా ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరజవాన్లకు మంగళవారం కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.

గరిష్టం/కనిష్టం
32.0/14.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

'కొండ'ంత ఆశలు..!

నేడు కొండగట్టుకు సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కొండగట్టు.. ఉమ్మడి జిల్లాలోనే కాదు.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకమైన చారిత్రక పుణ్యక్షేత్రం. ఉద్యమ సమయం నుంచి సీఎం కేసీఆర్ ఈ ఆలయం అభివృద్ధికి అనేక హామీలిచ్చారు. తాజాగా ఆలయం మాస్టర్‌ప్లాన్ కోసం రూ.100 కోట్లు కేటాయించారు. అంతేకాకుండా ఆలయం మాస్టర్ ప్లాన్‌ను రూపొందించేందుకు స్వయంగా కొండగట్టుకు వస్తున్నారు. సీఎం వెంట యాదాద్రికి డిజైన్లు అందించిన ఆనంద్‌సాయి కూడా వస్తున్నట్లు సమాచారం. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ పుణ్యక్షేత్రానికి రామాయణ కాలం నుంచి ప్రత్యేక చరిత్ర ఉంది. ఇంతటి వారసత్వ సంపదను కాపాడుకునేందుకు ఎట్టకేలకు ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్న వేళ.. భక్తులంతా కొండంత ఆశలతో అనేక డిమాండ్లు వినిపిస్తున్నారు. సీఎం పర్యటన సందర్భంగా కొండగట్టుపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్..!





పునాదుల్లోనే ఆగిపోయిన మాల విరమణ మండపం పనులు



గతంలో నిర్మించిన గదులు

సీఎం కేసీఆర్ షెడ్యూల్ ఇదీ..

జగిత్యాల:
- సీఎం కేసీఆర్ బుధవారం ఉదయం 9గంటలకు హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ నుంచి బయలు దేరుతారు.
- నేరుగా బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడినుంచి హెలిక్యాప్టర్‌లో జగిత్యాలకు బయలుదేరుతారు.
- ఉదయం 9.45 గంటలకు కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధికి చేరుకుంటారు.
- స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అధికారులతో సమావేశం నిర్వహిస్తారు.
- ఆలయ అభివృద్ధికి కేటాయించిన రూ.100 కోట్లు వెచ్చించి చేపట్టే ప్రగతి పనులపై సమీక్షిస్తారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి హైదరాబాద్‌కు హెలిక్యాప్టర్‌లో వెళ్తారు.
- మధ్యాహ్నం 1.40గంటలకు ప్రగతి భవన్ చేరుకుంటారు.

చారిత్రక ఆస్తి పరిరక్షణ

కొండపై అనేక చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయి. రామాయణకాలంలో లక్ష్మణుడిని కాపాడేందుకు సంజీవనిని హనుమంతుడు ఎత్తుకుపోతున్న క్రమంలో ఆ గుట్ట నుంచి చిన్న ముక్క విరిగిపడిందని, అదే ప్రస్తుత కొండగట్టు అన్నది భక్తుల విశ్వాసం. 300 ఏళ్ల క్రితం ఆవులకాపరి స్వామివారికి చిన్న ఆలయాన్ని నిర్మించగా.. 160 ఏళ్ల కింద క్రిష్టారావు దేశ్‌ముఖ్ ప్రస్తుత ఆలయాన్ని నిర్మించారని చరిత్ర చెబుతోంది. ఇక్కడ హనుమంతుడికి ద్వారపాలకుడిగా భేతాళుడు ఉండటం విశేషం. గుట్టపై భేతాళ స్వామి ఆలయం, సీతమ్మ కన్నీటిగుంటలు, మునుల గుహ, జలబుగ్గ, శ్రీరాముల ఆలయం, కొండలరాయుడి కోట, మెట్ల దారి తదితరాలను పరిరక్షించి, అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు కోరుతున్నారు.

- ఇటీవల రూ.100 కోట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి
- మౌలిక సదుపాయాలు, మాస్టర్‌ప్లాన్‌పై సమీక్ష
- ఆసుపత్రి, ఫైర్‌స్టేషన్, పీహెచ్‌సీ కావాలంటున్న భక్తులు
- హరిత హోటళ్లు, ఆన్‌లైన్ బుకింగ్‌లకు డిమాండ్
- రైల్వేస్టేషన్‌– కొండ మీదకు రవాణా మెరుగవ్వాలని కోరిక
- మానసిక చికిత్సాలయం ఉండాలంటున్న ఆరాధకులు
- 108 అడుగుల భారీ విగ్రహం ప్రతిష్ఠాపన?



ప్రసాదం తయారు చేసే కేంద్రం వెనుక అధ్వానంగా పరిసరాలు

అభివృద్ధి చేయాల్సినవి ఇవే..

- భేతాళ ఆలయం చెత్తాచెదారంతో నిండి పారిశుధ్య సమస్య ఎదుర్కొంటోంది.
- మండువేసవిలోనూ ఎండని సీతమ్మవారి కన్నీటి గుంటలకు ప్రచారం కల్పించాలి.
- కొండగట్టుపై శ్రీరాముని ఆలయం ఉన్న విషయం చాలామందికి తెలియదు.
- వందల ఏళ్ల క్రితం తపస్సు చేసుకున్న 'మునులగుహ'కు కాలిబాట కూడా లేదు.
- కొండగట్టు ఘాట్ ప్రాంతం నుంచి కిందికి వెళ్లే క్రమంలో జలబుగ్గ అనే నీటి ప్రవాహం కనిపించకుండా పోయింది.
- ఒకప్పుడు బల్మూరి వంశానికి చెందిన కొండలరాయుడి కోట, గుట్టకు మరింత ప్రచారం కల్పించాలి.
- గుట్ట మీద 108 అడుగుల భారీ ఆంజనేయుడి విగ్రహం ఏర్పాటును సీఎం ప్రకటిస్తారని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

మాస్టర్‌ప్లాన్‌లో వీటిని చేర్చాలి

- ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు. సమీపంలోని రైల్వేస్టేషన్‌తో కనెక్టివిటీ కల్పించాలి. భక్తుల వాహనాలకు పార్కింగ్ సమస్య తీర్చాలి.
- కొండగట్టులో మానసిక వ్యాధులు నయమవుతాయని నమ్మకం. అందుకే ఇక్కడ మానసిక చికిత్సాలయం ఏర్పాటు చేయాలి.
- కొండగట్టు పుణ్యక్షేత్రం దర్శనం, గదులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయం కల్పించాలి. ఏటీఎం, నెట్‌వర్క్ టవర్లను ఏర్పాటు చేయాలి. భక్తులకు తాగునీటి కొరత తీర్చాలి. హరితతోపాటు ప్రైవేటు హోటళ్లు ఏర్పాటు చేసి ఆతిథ్యరంగాన్ని ప్రోత్సహించాలి.
- కొండగట్టుపై జరిగే అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్‌స్టేషన్, శాంతి భద్రతల నియంత్రణకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్లు అవసరం.
- స్థానికంగా ఆసుపత్రి లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి. 2018లో ఇక్కడ ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైనపుడు ఆసుపత్రి లేని లోటు స్పష్టంగా కనిపించింది.
- లక్షలాది మంది హనుమాన్ దీక్షాపరుల మాల విరమణకు ప్రత్యేక మండపం కావాలి.
- తలనీలాలు సమర్పించే కల్యాణకట్టపై గద్దెలు, నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి.
- కొండపై నిత్యం 100 మందికి, మంగళ, శనివారాల్లో 200 మంది భక్తులకు భోజనం పెడుతున్నారు. ఈ సామర్థ్యాన్ని 1000 మందికి పెంచాలి.
- మెట్లదారి, కోనేరు, డ్రైనేజీలు అధ్వానంగా మారాయి. వెంటనే మరమ్మతులు చేయాలి.



సీతమ్మ కన్నీటి ధారలు



కల్యాణకట్ట దుస్థితి

భక్తుల సమస్యలు తీర్చండి



కొండగట్టు ఆలయానికి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు రూ.100 కోట్లు ఇవ్వడం గొప్ప విషయం. పార్కింగ్, గదులు, తాగునీరు సమస్యలను తీర్చి, ఆలయ పరిసరాలను మరింత అభివృద్ధి చేయాలి.

– ఆరోహి, భక్తురాలు హైదరాబాద్

అభివృద్ధి కోసమే నిధులు

కొండగట్టు ఆలయానికి రూ.100 కోట్లతో మాస్టర్‌ప్లాన్ రూపొందించడం సంతోషం. ఇక ఆలయ అభివృద్ధి వేగం అందుకుంటుంది. పరిసరాలు మెరుగుపడి, స్థానికంగా మరింత మందికి ఉపాధి అవకాశాలు అందివస్తాయి.

– బద్దం తిరుపతిరెడ్డి, సర్పంచ్ ముత్యంపేట

చరిత్రాత్మక నిర్ణయం



రూ.100 కోట్లతో కొండగట్టుకు మాస్టర్ ప్లాన్ రూపకల్పన చరిత్రాత్మక నిర్ణయం. ఈ నిర్ణయంతో ఆలయ చరిత్రలో కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారు. పుణ్యక్షేత్రానికి జాతీయస్థాయిలో ప్రచారం కల్పించడం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచడం, పర్యాటకంగా మరో యాదాద్రిలా మార్చాలన్న పట్టుదలతో సీఎం మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు.

– సుంకె రవి శంకర్, ఎమ్మెల్యే చొప్పదండి

నిజమైన హిందువు కేసీఆర్





ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, సమీక్షిస్తున్న స్మితా సబర్వాల్

- మంత్రి గంగుల కమలాకర్
- అధికారులతో కలిసి సీఎం కేసీఆర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన

కొండగట్టు(చొప్పదండి): ఆలయాల అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చిస్తున్న సీఎం కేసీఆర్ నిజమైన హిందువు అని, ఆయన కొండగట్టు పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఆయన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో సీఎం కేసీఆర్ పర్యటన ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ శ్రీరాముడి పేరును ఎన్నికల కోసం వినియోగించుకుంటున్నారని విమర్శించారు. నిజంగా ధర్మాన్ని కాపాడేవారే అయితే కొండగట్టు ఆలయ అభివృద్ధికి రూ.వంద కోట్లు తేవాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పుడే బీజేపీని ప్రజలు నమ్ముతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొండపై స్మితా సబర్వాల్

సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్ కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నా రు. ఆలయ అభివృద్ధికి ప్రతిపాదించిన మ్యాప్ పరిశీలించారు. సీఎం కేసీఆర్ మంగళవారం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఆమె పర్యటించి అందుకు తగిన ఏర్పాట్లు పరిశీలించారు.

నేటినుంచి అల్పాహారం

- 5,992మంది విద్యార్థులకు ప్రయోజనం

పెగడపల్లి(ధర్మపురి): జిల్లాలోని పదో తరగతి ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు బుధవారం నుంచి అల్పాహారం అందించనున్నారు. ఆకలితో అలమటిస్తూ విద్యార్థులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. దాతలు స్పందించి స్నాక్స్ అందించాలని ఉపాధ్యాయులు కోరినా ఫలితం లేదు. దీంతో ప్రభుత్వమే నేరుగా రంగంలోకి దిగింది. ఒక్కో విద్యార్థికి 34 రోజుల పాటు రూ.15 వెచ్చించి అల్పాహారం అందించేందుకు నిర్ణయించింది. ఇందులో స్కూల్ మేనేజ్‌మెంటు(ఎస్‌ఎంసీ)లను భాగస్వాములను చేసింది. తద్వారా జిల్లావ్యాప్తంగా 5,992మంది మంది టెన్త్ విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఈవిద్యా సంవత్సరంలో వందశాతం ఫలితాలు సాధించేందుకు నవంబర్ 14 నుంచి ప్రత్యేక బోధన తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం 8.30 – 9.30, సాయంత్రం 4.30 – 5.30 గంటల వరకు విద్యాబోధన చేస్తున్నారు. రోజూ ఉదయం ఒక సబెక్టు, సాయంత్రం మరో సబ్జెక్టును విద్యార్థులతో చదివిస్తున్నారు. కాగా, విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.30.55లక్షలు విడుదల చేసింది.

కౌంటింగ్ మిషన్ ఏర్పాటు

కొండగట్టు(చొప్పదండి): సీఎం కేసీఆర్ ఈనెల 15న కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి దర్శనం కోసం రానున్న నేపథ్యంలో మంగళవారం ఆలయంలో కౌంటింగ్ మిషన్ ఏర్పాటు చేశారు. దీనిద్వారా నిత్యం ఆలయానికి ఎంతమంది భక్తులు, ఇతరులు వస్తున్నారనే వివరాలు తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. ప్రత్యేక సందర్భాల్లో లక్షలాది మంది భక్తులు తరలివచ్చినా ఇలాంటి యంత్రాన్ని అధికారులు ఏర్పాటు చేయలేదని, సీఎం రాకతోనైనా ఇది అందుబాటులోకి రావడం హర్షణీయమని పలువురు భక్తులు పేర్కొన్నారు. కౌంటింగ్ యంత్రం ద్వారా భక్తుల లెక్కలతోపాటు ఇతర వివరాలు తెలుసుకునే వీలుందంటున్నారు.

క్లుప్తంగా

సీఐల బదిలీలు

జగిత్యాలక్రైం: మల్టీజోన్‌–1 పరిధిలో పనిచేస్తున్న సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ ఎస్‌.చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. నిర్మల్‌ జిల్లా భైంసాలో సీఐగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను కోరుట్ల సీఐగా నియమించారు. కోరుట్లలో సీఐగా పనిచేస్తున్న రాజశేఖర్‌రాజును జగిత్యాల డీఎస్పీకి బదిలీ చేశారు. జగిత్యాల డీఎస్పీలో పనిచేస్తున్న ఎ.శ్రీనివాస్‌ను ఐజీపీకి అటాచ్‌ చేశారు. ఖమ్మం జిల్లా కల్లెపల్లిలో పనిచేస్తున్న సీఐ ఆరీఫ్‌అలీ ఖాన్‌ను జగిత్యాల రూరల్‌ సీఐగా బదిలీ చేశారు. జగిత్యాల రూరల్‌ సీఐగా పనిచేస్తున్న వై.కృష్ణకుమార్‌ను ఐజీపీకి అటాచ్‌ చేశారు.

కుజదోష నివారణ పూజలు



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మంగళవారం కుజదోష నివారణ పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు మంత్రోచ్చారణలతో ఈప్రక్రియ చేపట్టారు. ఈ పూజలు చేస్తే కుటుంబ కలహాలు, వాస్తుదోషాలు, ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని అర్చకులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో మొక్కులు చెల్లించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం కామారెడ్డి– సిరిసిల్ల ప్రధాన రహదారి హెచ్‌పీ పెట్రోల్‌ పంపు ఎదుట లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. ద్విచక్రవాహనంపై ఎల్లారెడ్డిపేట వైపు వస్తున్న దీవిటి పోశెట్టి, యాడ అక్షయ్‌కుమార్‌లను లారీ ఢీకొనడంతో లారీ టైర్ల కింద పడ్డారు. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్షయ్‌కుమార్‌ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులు కామారెడ్డి జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిసింది.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

చందుర్తి(వేములవాడ): కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు కోనరావుపేట ఎస్సై రమాకాంత్‌ తెలిపారు. మూలవాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న సమాచారంతో వెళ్లగా ట్రాక్టర్‌ పట్టుబడిందన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్‌ యాజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

చందుర్తి(వేములవాడ): కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన వివాహిత మహిళ అల్లపు భారతి కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో తరచూ గొడవలతో మనస్తాపానికి చెందిన భారతి మంగళవారం బోయినపల్లి మండలం కొదురుపాక మిడ్‌మానేరు వద్దకు వెళ్లి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భారతి భర్త బాబు ఇటీవలే గల్ఫ్‌ నుంచి ఇంటికి తిరిగి వచ్చాడు.

13 మంది విద్యార్థినులకు అస్వస్థత

ఫుడ్‌పాయిజనే కారణమా!







అస్వస్థతకు గురైన విద్యార్థులు స్రవంతి, పౌర్ణమి, సంజన, లక్ష్మీప్రసన్న, సంజన






అంజలి, సాహితి, వసంత, సమీర

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 13మంది బాలికలు మంగళవారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఫుడ్‌ పాయిజనే ఇందుకు కారణమని అంటున్నారు. సమాచారం అందుకున్న పలువురు పాత్రికేయులు కేజీబీవీకి చేరుకుని సిబ్బంది సాయంతో ఆటోల్లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పిల్లల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.

రెండ్రోజుల క్రితం నాటి ఇడ్లీలు, సాంబారు..

కేజీబీవీ వసతి గృహంలో నాసిరకం భోజనం పెడుతున్నారని బాలికలు కొద్దిరోజులుగా నిరసన తెలుపుతున్నారు. ఉడికీఉడకని అన్నం, నీళ్లచారు, నాణ్యత లేని కూరలతో భోజనం తినలేకపోతున్నామని ఆవేదన చెందారు. ఈక్రమంలో మంగళవారం ఉదయం రెండు రోజుల క్రితం నాటి సాంబారుతో కూడిన ఇడ్లీ తిన్నామని తెలిపారు. సాయంత్రానికి అది వికటించి బాలికలు అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ మధులతను సంప్రదించగా, విద్యార్థినులకు నాణ్యమైన భోజనం పెడుతున్నామన్నారు. అయితే, ఘటనపై విచారణ జరిపాక తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి విద్యార్థినులకు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.




మంగళవారం పెట్టిన అన్నం, పప్పు



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

షర్మిలతోనే వైఎస్సార్‌ సంక్షేమ పాలన



మాట్లాడుతున్న సత్యరాజ్‌ వర్మ

కొడిమ్యాల(చొప్పదండి): వైఎస్సార్‌ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిలతోనే వైఎస్సార్‌ సంక్షేమ పాలన సాధ్యమని ఆ పార్టీ చొప్పదండి నియోజకవర్గం ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌ వర్మ అన్నారు. మంగళవారం కొడిమ్యాలలో జరిగిన వైఎస్సార్‌టీపీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోనే వైఎస్సార్‌టీపీ బలమైన శక్తిగా అవతరించిందన్నారు. అన్ని పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు ప్రజలు షర్మిల సేనలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఈనెల 15 నుంచి మార్చి 30 వరకు పర్యటించి, పూర్తిస్థాయి కమిటీల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కొండగట్టు బస్సు ప్రమాదంలో సుమారు 100 మంది చనిపోతే సందర్శించని ముఖ్యమంత్రి నేడు ఎన్నికల సమయం కావడంతో వరాలు కురిపిస్తూ ప్రకటన చేయడాన్ని ఎవరు స్వాగతించరన్నారు. ప్రజలపై విశ్వాసం ఉంటే తక్షణమే కొండగట్టును నియోజకవర్గంగా ముఖ్యమంత్రి ప్రకటించాలని డిమాండ్‌ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జగిత్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజేశ్‌ స్రవంతి, మండల అధ్యక్షులు ఎడపల్లి అరుణ్‌కుమార్, ప్రముఖ న్యాయవాది కాక అంజయ్య, పార్టీ నాయకులు రాజేశ్, బదుగు విజయ్, మేక తిరుపతి, వేముల శ్రీనివాస్, చింతపండు తిరుపతి, గుండు వినయ్‌కుమార్, చంద్రయ్య, మల్లయ్య, భూమయ్య, గాదె శ్రీనివాస్, తడక వెంకటరమణ పాల్గొన్నారు.

చిన్నారిని చిదిమేసిన నిర్లక్ష్యం

- స్కూల్‌ వ్యాన్‌ కిందపడి బాలిక దుర్మరణం



చిన్నారి హఫియ మృతదేహం

రాయికల్‌(జగిత్యాల): అసలే బడి బస్సు.. ఆపై ఆటాపాటల్లో మునిగితేలే చిన్నారులు.. ఎలాంటి ప్రమాదం ముంచుకు వస్తుందనే పరిజ్ఞానమే తెలియని బుడతలు.. వాహనం నడిపే సమయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన డ్రైవర్‌.. విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహించాడు. అప్పటిదాకా తన అక్క రాకకోసం ఎంతో సంతోషంగా ఉన్న ఆ చిన్నారిని చిదిమేశాడు. జగిత్యాల జిల్లా రాయికల్‌ మండలం సింగరావుపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం స్కూల్‌వ్యాన్‌ కిందపడి హఫియ(4) మృతి చెందడం కలచివేసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా రాయికల్‌ మండలం సింగరావుపేట గ్రామానికి చెందిన నిజామొద్దీన్‌–సైనా దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు హల్ఫియ(8) అల్లీపూర్‌లోని శ్రీవాణి పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. రెండో కూతురు హఫియ(4) సింగరావుపేటలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తోంది. చాలారోజుల తర్వాత మంగళవారం ఉదయం తండ్రి నిజామొద్దీన్‌ తన చిన్నకూతురు హఫియను అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లి దించివచ్చాడు. ఆ తర్వాత వీఆర్‌ఏ ఉద్యోగరీత్యా బయటకు వెళ్లాడు. సాయంత్రం తల్లి వెళ్లి ఆ పాపను ఇంటికి తీసుకొచ్చింది. అంతలోనే పెద్ద కూతురును తీసుకెళ్లిన స్కూల్‌ వ్యాన్‌ ఇంటి సమీపంలోకి వచ్చి ఆగింది. ఆమెను తీసుకెళ్లేందుకు వ్యాన్‌ వద్దకు వెళ్లింది తల్లి. తల్లి వెనకాలే వెళ్లిన చిన్నారి హఫియ వ్యాన్‌కిందకు పోయింది. పెద్దకూతురును వ్యాన్‌లోంచి కిందకు దించి ఇంటికి వెళ్తుండగా.. వ్యాన్‌ ముందుకు కదిలింది.. అంతే.. హఫియ ఆ వ్యాన్‌ వెనుక టైర్‌ కిందపడి నలిగిపోయింది. ఇంట్లో ఆడుకుంటున్న పాప వ్యాన్‌కిందకు ఎలావచ్చింది, ఎలా చనిపోయిందో తెలియని ఆ తల్లి హృదయం తల్లడిల్లిన తీరుచూసి గ్రామస్తులు కంటతడిపెట్టారు. చాలారోజుల తర్వాత తన కూతురును బైక్‌పై అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లానని, సాయంత్రమే ఇలా శవంగా చూస్తానని ఊహించలేకపోయానని తండ్రి బోరున విలపించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి- సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

- రాష్ట్రసంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్‌



చెక్కు అందిస్తున్నమంత్రి కొప్పుల ఈశ్వర్‌

వెల్గటూర్‌(ధర్మపురి): అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లని రాష్ట్ర సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు పంపిణీ చేశారు. ఒకవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ దేశంలో నంబర్‌ వన్‌గా నిలుపుతున్న సీఎం కేసీఆర్‌.. మరోపక్క రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లతో సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని చెప్పారు. ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో కాన్పు చేయించుకోలేని పేదల కోసం మాతాశిశు ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, బాలికలకు పాలు, గుడ్లు, న్యూట్రిషియన్‌ ఫుడ్‌ అందిస్తున్నారని చెప్పారు. అంతకు ముందు శాఖాపూర్‌లో బీఆర్‌ఎస్‌ జెండా ఆవిష్కరించారు. కొండాపూర్‌–శాఖాపూర్‌ మధ్య చేపట్టిన హైలెవల్‌ వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కొండాపూర్‌లో హైలెవల్‌ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ బి.సుధారాణి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పత్తిపాక వెంకటేశ్, తహసీల్దార్‌ రమేశ్, ఎంపీడీవో సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ టాలెంట్‌ టెస్ట్‌కు ఎంపిక



హన్సిక



పార్థివరెడ్డి

కథలాపూర్‌(వేములవాడ): జిల్లాస్థాయి ఫిజికల్‌ సైన్స్‌ టాలెంట్‌ టెస్ట్‌కు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో ఆనందరావు మంగళవారం తెలిపారు. కథలాపూర్‌లో నిర్వహించిన మండలస్థాయి టాలెంట్‌ టెస్ట్‌లో ప్రతిభ చాటడంతో జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారన్నారు. అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌ 9వ తరగతి విద్యార్థిని బొండ్ల హన్సిక, భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌ 8వ తరగతి విద్యార్థి ముస్కు పార్థివరెడ్డి జిల్లాస్థాయిలో జరిగే టాలెంట్‌ టెస్ట్‌కు ఎంపికయ్యారన్నారు. వీరిని హెచ్‌ఎంలు మార్గం రాజేంద్రప్రసాద్, సిరిపురం ఆనంద్‌ అభినందించారు.

కార్మికులకు ఈ- శ్రమ్‌కార్డులు



లేబర్‌ కమిషనర్‌ ఈశ్వరమ్మ

జగిత్యాలటౌన్‌: జిల్లాలో అర్హులైన కార్మికులు ఈ–శ్రమ్‌ కార్డులు పొందాలని లేబర్‌ కమిషనర్‌ ఈశ్వరమ్మ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఈశ్వరమ్మ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కలిగి ఉన్నవారు మినహా మిగతావాళ్లు ఈ శ్రమ్‌ కార్డులు పొందడానికి అర్హులని వివరించారు. ఈ – శ్రమ్‌ ద్వారా ఐదేళ్లపాటు బీమా సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. ప్రమాదవశాత్తు అంగవైకల్యం సంభవిస్తే పరిహారం అందుతుందని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1,24,063 మంది కార్మికులు ఈ – శ్రమ్‌ కార్డులు పొందారని వివరించారు. అర్హులైనవారు జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

‘ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటాం’

ధర్మపురి: ముఖ్యమంత్రి కేసీఆర్‌ కొండగట్టు పర్యటనను అడ్డుకుంటామని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు జాడి ప్రేమ్‌సాగర్, మోకెనపెల్లి రాజమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొండగట్టు బస్సు ప్రమాదంలో 62 మంది చనిపోతే పరామర్శించడానికి రాని కేసీఆర్‌ వట్టి మాటలు చెప్పి వంద కోట్లు ఇస్తానని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ధర్మపురి నృసింహస్వామి ఆలయానికి రూ.500 కోట్లు ఇస్తామని ప్రకటించి ఎంత మంజూరు చేశారో చెప్పాలని డిమాండ్‌ చేశారు. ఇప్పటివరకు ధర్మపురి ఆలయంలో పైసా పనులు జరుగలేదని అన్నారు. బూటకపు మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్‌ పర్యటనను అడ్డుకుంటామని పేర్కొన్నారు.

సేవలకు పురస్కారం

జగిత్యాల: వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురికి అంజలి మీడియా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో పురస్కారాలు ప్రకటించారు. సామాజిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, విద్యా, సేవ, పరిపాలన, పత్రికా రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి పురస్కారాలు అందిస్తున్నట్లు ఫౌండేషన్‌ చైర్మన్‌ రాజు మంగళవారం తెలిపారు. పెగడపల్లి మండలం బతికెపల్లికి చెందిన తాటిపర్తి శోభారాణి, జగిత్యాలకు చెందిన సామాజిక వేత్త తాటురాంచంద్రం, నమిలికొండ సాకేత, మంజులారెడ్డి, గణేశ్, గుండేటి రాజు, సుధీర్, తాదూరి శ్రీనివాస్‌ పురస్కారాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు కరీంనగర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పురస్కారాలు అందుకున్నట్లు పేర్కొన్నారు.

స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం



లంకదాసరి వెంకటేశ్‌(ఫైల్‌)

కథలాపూర్‌(వేములవాడ): ఇటీవల దుబాయి దేశంలో అనారోగ్యంతో మృతి చెందిన లంకదాసరి వెంకటేశ్‌(34) మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరింది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కథలాపూర్‌ మండలం గంభీర్‌పూర్‌ గ్రామానికి చెందిన లంకదాసరి వెంకటేశ్‌ ఉపాధి నిమిత్తం రెండున్నరేళ్ల క్రితం దుబాయి దేశం వెళ్లారు. అక్కడ కార్మికుడిగా పనిచేస్తున్న అతడికి కంపెనీలో సరైన ఉపాధి, వేతనం లేకపోవడంతో కల్లిబిల్లి అయ్యారు. అనారోగ్యానికి గురై ఈనెల 1న మృతి చెందాడు. మృతదేహం శవపేటికలో ఇంటికి చేరగా కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య పద్మ, కుమారుడు హర్షవర్ధన్‌ ఉన్నారు.

కెపాసిటర్ల బిగింపుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏడీఈ

జగిత్యాలఅగ్రికల్చర్‌: జగిత్యాల రూరల్‌ విద్యుత్‌ సెక్షన్ల పరిధిలోని గుల్లపేట రైతులకు మంగళవారం విద్యుత్‌ సిబ్బంది కెపాసిటర్ల బిగింపుపై అవగాహన కల్పించారు. ఏడీఈ హరీశ్‌ మాట్లాడుతూ కెపాసిటర్లు బిగించడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్ల మీద లోడ్‌ తగ్గుతుందని అన్నారు. లోవోల్టేజీ సమస్య నివారించవచ్చని సూచించారు. ఆటో స్టార్టర్లు తీసివేసి కెపాసిటర్లు బిగించుకోవాలని కోరారు.

ఆటో బోల్తా

సారంగాపూర్‌(జగిత్యాల): బీర్‌పూర్‌ మండల కేంద్రం శివారులో మంగళవారం ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా పులిమడుగు గ్రామానికి చెందిన ఓ కుటుంబం బీర్‌పూర్‌ శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు ఆటోలో వచ్చారు. పూజలు అనంతరం కొన్ని వస్తువులు జాతరలో కొనే క్రమంలో అక్కడ ఇరువర్గాల మధ్య గొడవ జరుగుతోంది. ఆటోలోని వారు ఇద్దరి మధ్య వారించి వెళ్లిపోయారు. అందులోని ఓ వర్గం వారు ఆటోను వెంబడించి రోడ్డుకు అడ్డంగా కట్టెలు పెట్టి ఆపేందుకు యత్నించారు. దీంతో ఆటో డ్రైవర్‌ రోడ్డుకు అడ్డుగా ఉన్న కట్టెలను తప్పించబోయి ఆటో బోల్తాపడింది. అందులోని ఇద్దరు చిన్నారులకు గాయాలు కాగా స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై అజయ్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

శంకరపట్నం(మానకొండూర్‌): పలు కారణాలతో జనవరి 22న పురుగుల మందు తాగిన కేశవపట్నంకు చెందిన గూళ్ల అఖిల్‌(19) హైదరాబాద్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి కుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్‌ పేర్కొన్నారు.

అర్హులందరికీ కంటి పరీక్షలు

మెట్‌పల్లి(కోరుట్ల): అర్హులైన ప్రతీఒక్కరు కంటి పరీక్షలు చేయించుకునేలా చూడాలని జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్‌ సూచించారు. బండలింగాపూర్‌లో చేపట్టిన కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. పరీక్షల తీరు పరిశీలించారు. 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

ఏరులై పారుతున్న మద్యం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

కోరుట్లరూరల్‌: రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. అయిలాపూర్‌ గౌడ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రేణుకా ఎల్లమ్మ జాతరకు ఆయన మంగళవారం హాజరై మాట్లాడారు. ఊరూరా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేస్తూ విచ్చల విడిగా మద్యం విక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు. కుల వృత్తిని నమ్ముకున్న గీత కార్మికుల ఉపాధికి విఘాతం కలుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ సమయంలో మద్యంపై రూ.7వేల కోట్ల ఆదాయం ఉంటే ప్రస్తుతం అది రూ.24వేల కోట్లకు చేరిందని వివరించారు. గీత కార్మికులకు ప్రోత్సాహం ఇవ్వాలని ఆయన కోరారు. కాంగ్రెస్‌ నాయకులు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం వెంకటేశ్‌గౌడ్, సత్యనారాయణ, కొంతం రాజం, తిరుమల గంగాధర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రైతుకు పరిహారం అందించాలి

రాయికల్‌(జగిత్యాల): దావన్‌పల్లిలో మాలోవత్‌ ప్రసాద్‌ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. మంగళవారం బాధితుని పశువుల కొట్టాన్ని పరిశీలించారు. నాయకులు గోపి రాజిరెడ్డి, రవీందర్‌రావు పాల్గొన్నారు.

‘రాజకీయ లబ్ధికోసమే ప్రతిపక్షాల విమర్శలు’

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు చేస్తున్నాయని రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు అన్నారు. మంగళవారం కోరుట్లలో విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్‌కు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యుత్‌ కోతలపై ముఖ్యమంత్రి ప్రకటన చేశారని రైతులు ఆందోళన చెందవద్దని 4,5 రోజుల్లో పరిస్థితి చక్కబడుతుందని తెలిపారు. ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీపై కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలోనే మాజీ మంత్రి రత్నాకర్‌రావు అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ ఏం చేయలేక పోయారన్నారు. కాంగ్రెస్‌ నాయకులకు ఈ విషయంపై సరైన అవగాహన లేక మాట్లాడుతున్నారని విమర్శించారు. విమర్శలు మానుకోవాలని సూచించారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతం కృషి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తెస్తున్నారని తెలిపారు.

ఐసీడీఎస్‌ అధికారులపై ఫిర్యాదు




ఫిర్యాదు కాపీని చూపుతున్న తిరుపతిరెడ్డి

మెట్‌పల్లి: ఐసీడీఎస్‌ ప్రాజెక్టు సీడీపీఓ తిరుమలాదేవితో పాటు జిల్లా ఉన్నతాధికారులపై సహకార సంఘం డైరెక్టర్‌ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో సమాచార హక్కు కమిషనర్‌ ఖలీలుల్లాను కలిసి ఫిర్యాదు చేశారు. ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకుల వివరాలు, వాటికి వెచ్చిస్తున్న వ్యయం, సూపర్‌వైజర్ల విధులకు సంబంధించిన తదితర వివరాలు కోరుతూ కొన్ని నెలల క్రితం సమాచార హక్కు చట్టం కింద సీడీపీఓ, జిల్లా కార్యాలయాల్లో సమాచారం కోరుతూ దరఖాస్తు చేయగా, వారు ఇవ్వడం లేదని కమిషనర్‌కు వివరించారు. పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతుండడం వల్లనే సమాచారం ఇవ్వడం లేదని తెలిపారు. దీనికి కమిషనర్‌ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తిరుపతిరెడ్డి పేర్కొన్నారు.

‘ఆదర్శ’ పాఠశాలల్లో ప్రవేశ పరీక్షకు నేటితో గడువు

మల్లాపూర్‌: జిల్లాలోని మోడల్‌ స్కూళ్లలో 2023–24 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తుల గడువు బుధవారంతో ముగుస్తున్నట్లు జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్‌ 16న ఆయా పాఠశాలల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారని వెల్లడించారు. 7, 8, 9, 10వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఏప్రిల్‌ 16న ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరుగనుందని అన్నారు. మే15న ఫలితాల ప్రకటన, సంబంధిత ప్రిన్సిపాల్స్‌కు మెరిట్‌ జాబితాల అందజేత, మే 24న మోడల్‌ స్కూళ్లలో విద్యార్థుల ఎంపిక జాబితా ఖరారు చేసి కలెక్టర్‌ ఆమోదం కోసం పంపిస్తామని తెలిపారు. మే 25 నుంచి 31 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌. జూన్‌ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆదర్శ పాఠశాలల్లో బాలికలకు మాత్రమే హాస్టల్‌ వసతి ఉన్నందున. 9,10వ తరగతులతో పాటు ఇంటర్‌ చదువుతున్న 100 మందికి మాత్రమే అవకాశం ఉందన్నారు. హాస్టల్‌కు కనీసం 3 కి.మీటర్లు, ఆపై దూరంగా ఉండేవారు హాస్టల్‌లో ప్రవేశానికి అర్హులు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంతర్‌జిల్లా బైకుల దొంగ అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ తుల శ్రీనివాసరావు

కరీంనగర్‌క్రైం: అంతర్‌జిల్లా బైకుల దొంగను కరీంనగర్‌ త్రీటౌన్‌ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ దామోదర్‌రెడ్డితో కలిసి ఏసీపీ తుల శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. కరీంనగర్‌లోని హుస్సేనీపుర ప్రాంతానికి చెందిన మహ్మద్‌ అమీర్‌(34) ప్రస్తుతం జగిత్యాల జిల్లా కోరుట్లలో ఉంటున్నాడు. గతంలో పెయింటర్‌గా పని చేసేవాడు. జల్సాలకు అలవాటు పడి డబ్బు సరిపోక దొంగతనాలు మొదలుపెట్టాడు. ఆరు నెలలుగా కరీంనగర్, హనుమకొండ జిల్లాల్లో ఇళ్ల ముందు, ఆసుపత్రుల వద్ద తాళం వేయకుండా నిలిపి ఉన్న ద్విచక్రవాహనాలను చోరీ చేశాడు. ఇప్పటి వరకు 9 బైకులు దొంగతనం చేశాడు. కరీంనగర్‌ త్రీటౌన్‌ పోలీసుస్టేషన్‌లో పరిధిలో మూడు బైకులు చోరీ చేయగా, వాహనదారుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మంగళవారం సుభాష్‌నగర్‌ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అమీర్‌తోపాటు మరో యువకుడు నంబర్‌లేని వాహనంపై అనుమానాస్పదంగా తిరగడాన్ని గుర్తించి విచారించగా బైక్‌లను చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. అతడి నుంచి కరీంనగర్‌ పట్టణంలో చోరీ చేసిన 3, హనుమకొండ సుభేదారి రాణా పరిధిలో చోరీ చేసిన 6 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మరో వ్యక్తి మైనర్‌ కావడంతో అతడికి నోటీస్‌ అందించి విచారిస్తున్నారు. అమీర్‌ను రిమాండ్‌ చేసినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో ఎస్సైలు శ్రీనివాసరావు, రవీందర్‌నాయుడు పాల్గొన్నారు.